తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 19 | గురువారం 8.10. 2026 | పేజీలు :4 | వెల: 2

ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై వెనక్కి తగ్గేది లేదు

- సర్వే నంబర్ 143పై సమగ్ర విచారణ జరపాలి
- కబ్జాదారుల సవాళ్లను ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటాం: మాజీ వైస్ చైర్మన్ దామోదర్



కొత్తగూడెం, అక్టోబర్ 7 (సూర్యోదయ వార్త)

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలను అసత్య ప్రచారంగా చిత్రీకరించడం సరికాదని కొత్తగూడెం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో వెనక్కి తగ్గేది లేదని, అసలు కబ్జాదారుల సవాళ్లను ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటామని అన్నారు. సర్వే నంబర్ 143లోని భూములపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

అధికారులే గుర్తించిన భూములపై వివాదం

సర్వే నంబర్ 143లోని భూములపై గతంలోనే రెవెన్యూ అధికారులు పరిశీలన జరిపి వివరాలను గుర్తించారని దామోదర్ పేర్కొన్నారు. సుమారు 81/2 కుంటల స్థలాన్ని డీసీసీబీ బ్యాంకు నిర్మాణానికి వినియోగించేందుకు అప్పట్లో కలెక్టర్ స్థాయిలో అనుమతులు లభించాయని తెలిపారు. 2017లోనే సంబంధిత



అధికారులు భూమిని గుర్తించారని, అప్పటి రెవెన్యూ శాఖ అధికారుల అనుమతులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

ప్రజా అవసరాల కోసం కోట్ల విలువైన స్థలం వినియోగం

పట్టణ ప్రకృతి వనం ఏర్పాటుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్లు దామోదర్ తెలిపారు. అలాగే టీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహణకు సైతం ఇదే సర్వే నంబర్‌లోని స్థలాన్ని వినియోగించినట్లు పేర్కొన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించిన అనంతరం స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించినట్లు తెలిపారు.

అదేవిధంగా రూ.70 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ, ప్రజా అవసరాలకు వినియోగించిన భూములపై ఇప్పుడు వివాదాలు తెరపైకి రావడం వెనుక ఉన్న కారణాలను అధికారులు నిగ్గు తేల్చాలని కోరారు.

వాస్తవాలు వెలుగులోకి తేవాలి

ప్రభుత్వ స్థలాలను కాపాడే విషయంలో ప్రజలు, అధికారులు కలిసి ముందుకు రావాల్సిన అవసరం ఉందని దామోదర్ అన్నారు. సర్వే నంబర్ 143కు సంబంధించిన రికార్డులు, గతంలో జరిగిన సర్వేలు, పంచనామాలు, అనుమతులు, నిర్మాణాల వివరాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని అధికారులను కోరారు. ప్రభుత్వ భూములపై ఎలాంటి అక్రమ ఆక్రమణలు జరిగాయో తేల్చి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

తగుదునమ్మా అంటూ వచ్చి తప్పించుకుంటారా?.



హైదరాబాద్ సూర్యోదయ వార్త

కుంటి సాకులు చెప్పి సంబంధం లేని కాగితాలు చూపి ప్రతిపక్షం అడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పకుండా “తగుదునమ్మా” అంటూ వచ్చి తప్పించుకున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీరు ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. విద్యుత్ వినియోగదారులపై ట్రూప్ అప్ చార్జీల పేరిట రూ.5,420 కోట్ల భారం మోపడం గురించి బీఆర్ఎస్ ప్రశ్నిస్తే ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్లిపోవడం ప్రజా పాలన అంటారా? అని నిలదీశారు. ఇవాళ మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రజలపై మోపిన భారాన్ని ఉపసంహరించుకొని పండుగ పూట శుభవార్త చెబుతారనుకుంటే భట్టి ఉసూరుమనిపించారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రూ.5,420 కోట్ల భారం ప్రజల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తామని భట్టి విక్రమార్క పక్కనే కూర్చొని అధికారులతో చెప్పించడం కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనం అన్నారు. రైతులు రోడ్ల మీదకు వచ్చి కరెంట్ కోసం ధర్నాలు చేస్తుంటే, కోతలే లేవు అని చెప్పడం మీకే చెల్లిందని మీరు సక్రమంగా కరెంట్ సరఫరా చేస్తే రైతులు ఎందుకు సబ్ స్టేషన్ల ముందు వస్తారు? ఎందుకు రోడ్లపై ధర్నాలు చేస్తారని ప్రశ్నించారు. దీ=నా ప్రభుత్వ హయాంలో ఏనాడైనా ఇలా రైతులు రోడ్లెక్కారా? మీరు తెస్తానన్న అనాటి రోజుకు ఇవేనా? అని నిదీశారు. ప్రజల సమస్యల గురించి మాట్లాడుతుంటే సవాళ్లు విసిరన భట్టి గారూ..మేము అడిగిన ఒక్క ప్రశ్నకు కూడా ఎందుకు సమాధానం చెప్పలేదన్నారు.

భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ 15 ఫిబ్రవరి నాటి ఖీ. చీశీ. 23014/1/2018-జూణ ప్రకారం ఎస్సీసీఎల్ (గ్రాజజూ) గనుల నుండి 14 మ్యీూ +-9 గ్రేడ్ బొగ్గును యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు కేటాయించిందని అలాంటప్పుడు కేటాయింపు లేదు అని ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి ఎందుకు సత్య దూరపు మాటలు మాట్లాడారు? అని హరీశ్ రావు ప్రశ్నించారు. ఎల్ నినో సాకు చెబుతూ యాదాద్రిలో 3000 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్లు, కేటీపీఎస్?లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అగిన మాట నిజం కాదా? ఇది మీ పరిపాలన వైఫల్యం కాకుంటే మరేమిటన్నారు.

రాష్ట్రంలో మొత్తంగా 140 మిలియన్ యూనిట్ల కెపాసిటీ ఉంటే 89 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు మీరే చెప్పారు కదా. ఇది మీ వైల్యం కాదా? అని మండిపడ్డారు. బొగ్గు ఉన్న దగ్గరే విద్యుత్ ప్లాంట్ ఉండాలె అని చెబుతున్న మీరు, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాయలసీమలో నీళ్ళు, బొగ్గు లేని చోట థర్మల్ ప్లాంట్ పెట్టింది నిజం కాదా? ఆనాడు ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు.

సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాడతాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సూర్యోదయ వార్త

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిల్లీలో ప్రజాస్వామ్య యుతంగా చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం మోదీ, అమిత్ షా.. నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అరెస్ట్ అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్, ప్రియాంకను కలిసేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల చర్యను రేవంత్ తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. “సర్‌ను తక్షణమే నిలిపివేయాలి. ప్రజల ఓటు హక్కును ఈసీ హరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ ఓట్ల టార్గెట్‌గా కుట్ర జరుగుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాడతాం. ఎన్నికల్లో గెలవడానికి ఈడీ, సీబీఐని వాడేవారు. ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తున్నారు” అని రేవంత్‌రెడ్డి విమర్శించారు



రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి మచ్చ



- రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అరెస్టుల మార్గం
- చలో రాజ్‌భవన్" నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ సూర్యోదయ వార్త

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని వరుసగా రెండోసారి అరెస్టు చేయడాన్ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) తీవ్రంగా ఖండిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రి తర్వాత అత్యున్నత గౌరవం ఇవ్వాల్సిన ప్రతిపక్ష నాయకుడి పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ చేసిన తప్పిదాలను ప్రజల ముందుకు తీసుకువచ్చినందుకే రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అరెస్టుల మార్గాన్ని ఎంచుకుందని విమర్శించారు. ఇండియా కూటమి నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, - మిగతా 2 లో..

ఓటు.. సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌దే

- నెహ్రూను ప్రధాని చేయడమే తొలి ఓటు, సీటు చోరీ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు: బండి



“యంగ్ ఇండియా” రయ్.. రయ్..

- ఊపందుకున్న పాఠశాలల నిర్మాణాలు
- రాష్ట్ర వ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో పాఠశాలలకు ప్రణాళిక
- 87 చోట్ల వివిధ దశల్లో పాఠశాలల పనులు
- నిర్మాణాలకు రూ. 1,144.85 కోట్ల నిధులు విడుదల

డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు: భట్టి

హైదరాబాద్ సూర్యోదయ వార్త

తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. “20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. కొందరు నేతలు తప్పుదు ప్రచారంతో ప్రజలను గందరగోళపం స్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. అవసరాలకు తగ్గట్టు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు. విద్యుత్ సంస్థలను లిస్టెడ్ కంపెనీలుగా మార్చే ప్రతిపాదన లేదు. పదేళ్లు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అలా మాట్లాడటం సరికాదు. విద్యుత్ సిబ్బందిని కించపరిచే విధంగా రాజకీయ నేతలు విమర్శలు చేస్తున్నారు. ఊహించుకుని మాట్లాడటం వల్ల రాష్ట్రానికే నష్టం. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల భారీగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. యాదాద్రి పవర్ ప్లాంట్ పాపం ఎవరిది? ఒక పవర్ ప్లాంట్ పెట్టేముందు.. అవసరమైన కోల్ చూసుకుని పెడతారు. సింగరేణి నుంచి యాదాద్రికి గ్రేడ్ 9 కోల్ సప్లయ్ చేస్తామని చెప్పారు. బొగ్గు సరఫరాకు ఒప్పందం చేసుకుని సప్లయ్ చేయలేదు. మొదటి నుంచి కోల్ అలాట్‌మెంట్ లేకుండానే యాదాద్రి పవర్ ప్లాంట్ కట్టారు” అని భట్టి విక్రమార్క తెలిపారు.

సింగరేణి స్థలాల్లో మైనింగ్ చేయని ప్రదేశాల్లో నెహ్రూ హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు, కార్మికుల ఇళ్ల నిర్మాణం కోసం లేఅవుట్లు వేయనున్నారు. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి అధికారులను ఆదేశించారు. శిథిలమైన డి--టైప్ క్వార్టర్స్‌ను తొలగించి వాటిస్థానంలో కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేవిధంగా అన్ని



వసతులతో నూతన క్వార్టర్స్ నిర్మాణం చేసి నెహ్రూ పేరిట సింగరేణి కాలనీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు..

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించిన భూముల్లో 5,774 ఎకరాలు తిరిగి రెవెన్యూ శాఖకు అప్పగించగా అందులో 4,500 ఎకరాలు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. మిగిలిన 1,250కిపైగా ఎకరాల్లో జీరో నంబర్ 76 ప్రకారంగా అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న దీర్ఘకాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాభవన్‌లో మంగళవారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని డిప్యూటీ సీఎం నిర్వహించారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గడ్డం వివేక్ వెంకటస్వామిలతోపాటు సింగరేణి పరిధిలోని ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

దేశమే ధ్యాసగా.. ప్రజాసేవే శ్వాసగా..

ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రయాణం

- ఎన్ని సవాళ్లు ఎదురైనా మోదీ ఆశీర్వాదంతో తెలంగాణలో కాషాయ జెండా ఎగరేస్తాం
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి

2 లో



ఉపాధి హామీకి ‘అక్టోబర్’ జోష్

- రోజుకు 2.54 లక్షల మందితో సరికొత్త రికార్డు
- గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా అక్టోబర్‌లో
- రోజుకు 2.54 లక్షల మందికిపైగా హాజరు
- వేజ్ సీకర్ల సంఖ్య మరింత పెంచాలని మంత్రి సీతక్క ఆదేశం

పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌కు ఘన వీడ్కోలు..

ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేసిన పోలీసు అధికారి..



వాజేడు ములుగు జిల్లా అక్టోబర్ 07(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ వాజేడు మండల కమిటీ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, సన్మానం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తుడుం దెబ్బ నాయకులు మాట్లాడుతూ.. సాధారణంగా పోలీసులను చూస్తే అమాయక ఆదివాసీ ప్రజలు భయపడుతుంటారని, అయితే ఎస్సై కృష్ణ ప్రసాద్ మాత్రం ఆదివాసీలతో సోదరుడిలా, పెద్దలకు కొడుకులా మెలుగుతూ ప్రజల సమస్యలను ఆప్యాయంగా విని పరిష్కరించేందుకు కృషి చేశారని అన్నారు.ఆదివాసీ యువతకు పెద్ద అన్నయ్యలా మంచి చెడులు చెబుతూ, ప్రజలకు అవసరమైన సమయంలో వారి ఇళ్ల వద్దకే వెళ్లి సహాయం చేసిన ఆయన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. చిన్న కార్యక్రమమైనా, పెద్ద కార్యక్రమమైనా ఆదివాసీ ప్రజల మధ్యకు వచ్చి కలిసిపోయే ఆయన తీరు అందరి మనసులను గెలుచుకుందని తెలిపారు.తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి పాయం జానకి రమణ మాట్లాడుతూ.. కృష్ణ ప్రసాద్ సార్ చేసిన సేవలు పేరూరు ప్రాంత ఆదివాసీ ప్రజల గుండెల్లో ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. బదిలీపై వెళ్తున్నప్పటికీ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి తిరిగి ఆదివాసీ ప్రాంతానికి రావాలని ఆకాంక్షించారు.అనంతరం వాజేడు మండల కమిటీ తుడుం దెబ్బ నాయకులు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ మండల కమిటీ నాయకులు, ఆదివాసీ యువత, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు...

ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- **ఈ నెల అక్టోబర్ 17 వరకు దరఖాస్తుల స్వీకరణ.**
- **ప్రిన్సిపాల్ డాక్టర్ జి. స్వర్ణ కుమారి.**



ములుగు. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి..)

ప్రభుత్వ వైద్య కళాశాల, దాని అనుబంధ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వైద్య విభాగంలో రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. స్వర్ణ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల అక్టోబర్ 12న ఉదయం 11 గంటల నుంచి 17న మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు, ఈ నెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అర్హతలు, దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ **https://gmcmu-lugu.org** ను సందర్శించాలని ఆ ప్రకటనలో ప్రిన్సిపాల్ పేర్కొన్నారు...

బూర్గుపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ

ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో..





వెంకటాపూర్: ములుగు జిల్లా. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి.)

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని బూర్గుపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి పాఠశాలలోని విద్యా పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన పీఓ విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయి, విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, తరగతి బోధనకు సంబంధించిన అంశాలను పరిశీలించి, విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ చూపాలని సూచించారు.అనంతరం పాఠశాలలోని డార్మిటరీని పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులు, విద్యా సంబంధిత పుస్తకాలు, ఇతర నిర్వహణ అంశాలను కూడా పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు సమర్థవంతంగా అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదల, క్రమశిక్షణ, హాజరు, ఆరోగ్యం మరియు వసతి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఇసుక లారీలతో రైతులకు తీరని నష్టం..

- **రోడ్లపై వచ్చే దుమ్ము రైతులు పంట పొలాలకు ముప్పు....**
- **అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల తీవ్ర ఆగ్రహం...**
- **ప్రభుత్వాలు మారుతున్న ఈ రోడ్లను పట్టించుకునే వారు లేరు...**





వెంకటాపురం ములుగు జిల్లా. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త..)

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రం నుంచి భద్రాచలం వైపు వెళ్లాలన్నా.. భద్రాచలం నుండి వెంకటాపురం రావాలన్న ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించాలన్నా ప్రయాణికులకు గుంతలమయమైన ఈ రహదారి నరకయాతనను తలపిస్తోంది. 'అడుగు ముందుకు వేయాలంటే ఒక గుంత.. దాటితే మరో గుంత' అన్నట్లుగా రోడ్డు మొత్తం పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. ఈ రహదారిపై నిత్యం 24 గంటలూ వాహనాలు, ప్రయాణికుల రద్దీ కొనసాగుతుంటుంది. ముఖ్యంగా ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు మరియు ఇతర వాహనాల డ్రైవర్లు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వణికిపోతున్నారు.?భారీ ఇసుక లారీలతో మరింత దారుణంగా..?భారీ ఇసుక లారీల రాకపోకలతో ఈ రహదారి మరింతగా దెబ్బతింటోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే గుంతలతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుపై ఇసుక లారీలు నిత్యం నడుస్తుండటంతో పరిస్థితి మరింత క్షీణించింది. అయినా సరే, సంబంధిత అధికారులు మరియు కాంట్రాక్టర్లు ఈ రోడ్డు సమస్యపై కనీస దృష్టి సారించకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అధికారుల నిర్లక్ష్యం.. కాలయాపన రహదారి నిర్మాణం, మరమ్మతుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగానే పరిస్థితి ఇంతటి దుస్థితికి చేరిందని ప్రజలు విమర్శిస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకుండా కాలయాపన చేయడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు కష్టాలపై ప్రజల్లో రోజురోజుకూ అసంతృప్తి పెల్లుబుకుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని, లేనిచో ప్రజా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.? అధికారులు వెంకటాపురం మండలం లో ఉన్న రోడ్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చి, ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని వేడుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ సార్ స్వయంగా చొరవ చూపితేనే ఈ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు తీవ్ర ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు....

ఇసుక లారీలతో ఇబ్బంది పడుతున్న రైతులు. పంట పొలాలపై పడుతున్న దుమ్ము..

ములుగు జిల్లా వెంకటాపురం మండలం లో ప్రధాన రహదారిపై వెళ్తున్న ఇసుక లారీలతో ప్రజల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న వరి పొలాలు . పత్తి చేను. మిర్చి. పంటలకు త్రివరా నష్టం జరుగుతుంది. ఇటు ములుగు జిల్లా పరిధిలో ఉన్న ఇసుక క్వారీలో నడుస్తున్న లారీలతోపాటు . పక్క జిల్లా ఆయన భద్రాది కొత్తగూడెం చర్ల మండలం సుబ్బంపేట ఇసుక క్వారీ నుండి వేల సంఖ్యలో యాకన్న గూడెం . ఏదిర. ఆలు బాకా . వెంకటాపురం వైపు వెళ్తున్న లారీలు తో ప్రధాన రహదారిపై దుమ్ముదులి అధికంగా లేవడంతో పంట పొలాల మీద ఎక్కువ ప్రభావం పడుతుంది. దీనివల్ల రైతులు తీవ్ర నష్టం వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి. రోడ్లపై వెళ్తున్న ఇసుక లారీలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు...

ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు..

నెలవారీ తనిఖీలో ములుగు జిల్లా కలెక్టర్

బోర్డుడే హేమంత్ సహదేవరావు...





ములుగు. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి బోర్డుడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను, భద్రతా సిబ్బందిని ఆదేశించారు.బుధవారం జిల్లా కేంద్రం లోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఈవీఎం గోదాం ప్రధాన ద్వారానికి ఏర్పాటు చేసిన సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, నిరంతర నిఘా వ్యవస్థ, విద్యుత్ సరఫరా, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర భద్రతాపరమైన సమస్యలు ఎదురైన సందర్భంలో అనుసరించాల్సిన విధివిధానాలపై సంబంధిత సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. గోదాంలో భద్రతా ప్రమాణాలు నిర్దేశిత నిబంధనల మేరకు అమలయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఈవీఎం గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలు తదితర రికార్డులను పరిశీలించారు. గోదాంను సందర్శించే ప్రతి వ్యక్తి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. భద్రతా సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఈవీఎంల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ నీతీష్ కుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు...

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతను సన్మానించిన గ్రామస్తులు...



మంగపేట. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని ఎంపీపీ ఎస్ అబ్బాయి గూడెం పాఠశాలలో పనిచేస్తూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న శ్రీ కొమరం నాగేశ్వరరావు నీ గ్రామస్తులు మరియు ఉపాధ్యాయులు కలిసి ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడినారు. నాగేశ్వరరావు బదిలీపై ఈ పాఠశాలకు వచ్చినప్పటి నుండి సమయపాలన పాటిస్తూ ప్రతి రోజు పాఠశాలకు హాజరవుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం చేస్తున్నారని మరియు విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారని వక్తలు వారి ప్రసంగంలో తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, లక్ష్మి పొరుగు పాఠశాల ఉపాధ్యాయులు జబ్బ రవి, కోటి నాగేశ్వరరావు,చందా రఘుపతి, సి ఆర్ పి యలం నాగేష్ గ్రామస్తులు గోంది నారాయణ, కోరం నారాయణ,పాయం రమేష్, జబ్బ లక్ష్మీనారాయణ, మొగిలి, నరేష్,మోహన్,సుదర్శన్,ఆదినారాయణ, మహిళలు కోరం పద్మ,సుశీల,సుజాత,కమల ,వెంకట లక్ష్మి, విజయకుమారి మరియు పాఠశాల విద్యార్థులు తుడుం దెబ్బ మండల ఉపాధ్యక్షులు తులం రామకృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన...!

- **కజీ బీవీ పాఠశాలలో విద్యార్థులకు పలు సూచనలు..**
- **ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటాపురం సిఐ-. ముత్యం రమేష్..**
- **ఎస్సై. కొప్పుల తిరుపతిరావు..**



వెంకటాపురం. నూగూరు. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల లో బుధవారం సైబర్ క్రైమ్ అవేర్నెస్ గురించి వెంకటాపురం సిఐ. ముత్యం రమేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ– విద్యార్థులకు సైబర్ క్రైమ్స్ వల్ల జరిగే నష్టాలు. తెలియని యాప్స్ వల్ల జరిగిన నష్టాలు . ఓటిపి. ఫ్రాడ్స్. తెలియని లింక్స్ క్లిక్ చేయడం వల్ల జరిగే నష్టాల గురించి పిల్లలకు వివరించారు. అనంతరం ఎస్సై. కొప్పుల తిరుపతిరావు మాట్లాడుతూ. విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి చూపాలని . సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని . సెల్ ఫోన్ లో యాప్ ద్వారా బెట్టింగులకు పాల్పడి చాలామంది విద్యార్థుల ప్రాణాలు కోల్పోతున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని తల్లి దండ్రులు పిల్లలకు పలు సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు. ఉపాధ్యాయ బృందం. పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరం పర్యటనలో ఆదివాసి ముద్దుబిడ్డ తాటి కృష్ణ ..

మహాదేవపూర్ లో తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుడిమెత సమ్మయ్య ఘన సన్మానం..



మంగపేట. ములుగు జిల్లా. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త)

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పర్యటనలో భాగంగా ఆదివాసి ముద్దుబిడ్డ తాటి కృష్ణ ను తుడుందెబ్బ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆదివాసుల హక్కులు, చట్టాల పరిరక్షణ మరియు గిరిజనుల అభివృద్ధి కోసం ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు ఆదివాసీ సమాజం కోసం సేవ చేస్తున్న వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి కార్యక్రమాలు ఆదివాసుల్లో ఐక్యత, స్ఫూర్తిని పెంపొందిస్తాయని నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో కుడిమెత సమ్మయ్య.బూరుగుడెం సర్పంచ్ మడె సత్యనారాయణ, పెద్దల రాంబాబు,పెరమల సురేందర్,చెరుకుల రమేష్, తదితరులు పాల్గొన్నారు..

మేడారం తర్వాత... ఇదే పెద్ద జాతర..!

ఐలాపూర్ సమ్మక్క సారలమ్మ జాతర తేదీలు ఖరారు చేసిన పూజారులు..



కన్నాయిగూడెం. ములుగు జిల్లా అక్టోబర్ 07(సూర్యోదయ వార్త . ములుగు ప్రజలది)

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపూర్ సమ్మక్క– సారలమ్మ మహా జాతర తేదీలు ఖరారు అయ్యాయి. 2027 ఫిబ్రవరి 17 న బుధవారం సర్వాయి నుంచి సారలమ్మ. గ ద్దెకు రానున్నారు . ఫిబ్రవరి 18న గురువారం సమ్మక్క దేవర గుట్ట నుండి గద్దెకు చేరుకోనున్నారు. 19 న శుక్రవారం భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోనున్నారు. 20న శనివారం సమ్మక్క సారలమ్మ దేవతల తిరిగి వన ప్రవేశం చేయనున్నారని పూజారిలో తెలిపారు. కాగా.. మేడారం తర్వాత ఇదే పెద్ద జాతర..

అగ్నిప్రమాదంలో గాయపడిన చిన్నారులకు బీఆర్ఎస్ నేతల పరామర్శ..

- బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం..
- చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తాం: కాకులమర్రి ప్రదీప్‌రావు..



కన్నాయిగూడెం, ములుగు జిల్లా అక్టోబర్ 07: (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి.)

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్, నాగలక్ష్మి దంపతుల చిన్నారులు నిహస్వి (5), నిహాంత్ (2) ప్రమాదవశాత్తు చెత్తకుప్పల మంటలు తగలడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు ఆయన సోదరులు కాకులమర్రి ప్రదీప్‌రావు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. తమ వంతు సహాయంగా కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారులకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహకారం అందిస్తామని, బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కాకులమర్రి ప్రదీప్‌రావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు కావిరి చిన్నికృష్ణ, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

రాహుల్, ప్రియాంక అరెస్ట్ అప్రజాస్వామికం...

- శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి..
- ఓట్ల తొలగింపుపై కేంద్రం సమాధానం చెప్పాలి..
- రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్..



ఏటూరునాగారం, అక్టోబర్ 7: (సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

ఓట్ల తొలగింపు వ్యవహారంపై నిరసనగా ఢిల్లీలో శాంతియుత ర్యాలీ చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరికాదన్నారు. ఓట్ల తొలగింపుపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అణచివేత ధోరణికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల యూత్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు..

కేయూ ఇంటర్ టోర్నమెంట్స్ వాలీబాల్ విజేతగా ములుగు జట్టు...

ములుగు. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)



కాకతీయ యూని వర్సిటీ పరిధిలోని కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్ టోర్నమెంట్స్ వాలీబాల్ పోటీల్లో ములుగు డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. కేయూ లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జట్టు ను పిడి సోమన్న ను కళాశాల ప్రిన్సిపాల్. డాక్టర్ మల్లేశం. అధ్యాపకులు అభినందించారు. జట్టు విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇల్లు.. పేదల ఇంట వెలుగులు..

- ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరైన ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,
- పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన!
- ఇందిరమ్మ ఇల్లు అంటే.. పేద కుటుంబానికి భరోసా!
- సొంతింటి గడప అంటే.. ఆ కుటుంబానికి కొత్త భవిష్యత్తు..

మంగపేట. ములుగు జిల్లా అక్టోబర్ 07(సూర్యోదయ వార్త.)

ములుగు జిల్లా మంగపేట మండలం పూరేడుపల్లి గ్రామంలో బుధవారం సింగ నరసింగరావు స్వరూప ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరైన ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఈ సందర్భంగా రేగ కళ్యాణి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా ఆచరణలో సహకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం... అర్హులైన ప్రతి కుటుంబానికి గూడు



కల్పించాలని లక్ష్యంతో మన మంత్రి సీతక్క నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ముందుకు సాగుతుందని అన్నారు. అట్టడుగు వర్గాల కళ్ళలో ఆనందమే సంక్షేమ పథకాల అసలైన విజయం అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి . ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి సీతక్క కు ములుగు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ పాయం అనిత. ములుగు మార్కెట్ డైరెక్టర్ కొమరం బాలన్న. ఎటునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు భాగ్య, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బిల్వాది నరేష్. మండల యూత్ కాంగ్రెస్



నాయకులు కబ్బాక లక్ష్మణ్. మంగపేట యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ భూక్య కుమార్. మండల సీనియర్ నాయకులు పోదాం నాగేశ్వరరావు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.కె అజ్మత్. యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు తులం నాగబాబు తదితరులు పాల్గొన్నారు..

ఏజెన్సీ యువతకు ప్రత్యేక కొలువులు ఎక్కడ...?

- జీవో నెంబర్ 3 రద్దుతో ముగిసిన 100% టీచర్ రిజర్వేషన్..
- తెలంగాణలో ప్రత్యామ్నాయ ఉద్యోగ విధానం ఏమిటి?
- కొత్త జీవో కొరకు టీఏసీ- గవర్నర్ చొరవ చూపాలి...
- తుడుందెబ్బ నాయకుడు మట్టి రమేష్ డిమాండ్..

వెంకటాపురం(నూగూర్), అక్టోబర్ 07(సూర్యోదయ వార్త . ములుగు ప్రతినిధి)

షెడ్యూల్ ఏరియాలోని గిరిజన యువతకు ప్రత్యేక ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాన్ని



రూపొందించాలని తుడుందెబ్బ నాయకుడు మట్టి రమేష్ డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 3 రద్దు నేపథ్యంలో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు దెబ్బతినకుండా కొత్త ఉద్యోగ విధానం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. షెడ్యూల్ ఏరియాలోని 29 శాఖల్లో స్థానిక గిరిజనులకు అందుబాటులో ఉన్న ఉద్యోగాలను గుర్తించి ప్రత్యేక నియామక ప్రక్రియ చేపట్టాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే సాధారణ ఉద్యోగ నియామకాల్లోనూ షెడ్యూల్ ఏరియా రిజర్వేషన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. గిరిజన యువతకు ప్రత్యేక ఉద్యోగ అవకాశాల కోసం ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఈ అంశాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి, న్యాయపరమైన పరిధిలో కొత్త విధానం లేదా జీవో రూపొందించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలని మట్టి రమేష్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిశీలించి కొత్త జీవోను తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు..

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన...



గోవిందరావుపేట. అక్టోబర్. 07(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి.)

– ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి మోడల్ పాఠశాలలో పసర పోలీసులు బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొబైల్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫ్రీ లాటరీ. ఫ్రీ రీఛార్జ్. పేరుతో వచ్చే లింకులు మోసపూరిత మైనవని తెలిపారు. ఇంస్టాగ్రామ్ లో కనిపించే ఆకర్షణీయ మైన ఫోటోల వెనుక కూడా మోసాలు ఉండొచ్చని. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు. విద్యార్థులు. తదితరులు పాల్గొన్నారు..

పొన్నెకంటి జయకుమారి, సంజీవరాజుకు ఘన సన్మానం

కొత్తగూడెం, అక్టోబర్ 7 (సూర్యోదయ వార్త)

సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షురాలు పొన్నెకంటి జయకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమాచార కమిషనర్ దేశాల భూపాల్ హాజరై ప్రసంగించారు. అనంతరం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సురా స్రవంతి కలిసి పొన్నెకంటి జయకుమారి, పొన్నెకంటి సంజీవరాజులను శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేసి శు



భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, జాతీయ సహాయ కార్యదర్శి అన్నవరం సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ సందేశాన్ని దేశ ప్రజలందరూ ఆమోదించారు. ఎంపీ ఈటల



25 ఏళ్లుగా గొప్ప రాజకీయ దక్షతతో సుదీర్ఘ ప్రజాసేవ చేసిన మహానాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప సభ', 'సేవా జ్యోతి యాత్ర' కార్యక్రమాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సుదీర్ఘ ప్రజాసేవ ద్వారా దేశ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఆయనకు అండగా నిలుస్తున్న దేశ ప్రజలకు, ఎన్డీఏ మిత్రపక్షాలకు ధన్యవాదాలు తెలిపారు. నరేంద్ర మోడీ దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగుతున్న దార్శనిక నాయకుడని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగించిన కీలక అంశాలను లైవ్ ద్వారా వీక్షించిన ప్రజలను ఈటల అభినందించారు.

ప్రధానమంత్రి తన ప్రసంగంలో దేశ ప్రజలతో పాటు పార్టీ కార్యకర్తలకు కూడా భవిష్యత్ కార్యా చరణపై దిశానిర్దేశం చేశారని తెలిపారు. 'మోడీ సంక ల్పం.. దేశ సంకల్పం' అనే నినాదంతో దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. 2047 నాటికి భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలపాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని ప్రధాని ఇచ్చిన పిలుపు ఎంతో ముందుచూపుతో కూడుకున్నదని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సందేశాన్ని, ఆయన సంకల్పా న్ని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఈటల రాజేందర్ కోరారు. దేశ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని సూచించారు.కార్యక్రమానికి ముందు పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్‌రెడ్డిని శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్ రెడ్డి, ఎస్ఎన్ఎస్ ప్రభాకర్, తాడూరి శ్రీనివాస్, మల్లారెడ్డి, శిల్పారెడ్డి, రవి నాయక్, రాజేష్, నాగరాజు, తిరుపతిరావు, మాణిక్యరెడ్డి, శ్రీధర్ రెడ్డి, అజయ్ రెడ్డి, అనిల్, మురళి, మురళీకృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్లు శ్రావణ్ కుమార్, రాజ్యలక్ష్మి హాజరయ్యారు.

కొత్తగూడెం 1టౌన్ సీఐగా భాధ్యతలు తీసుకున్న సముద్రాల జితేందర్

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం.. చట్ట ఉల్లంఘనలపై కఠిన చర్యలు



కొత్తగూడెం, అక్టోబర్ 7 (సూర్యోదయ వార్త)

కొత్తగూడెం 1టౌన్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జితేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన కరుణాకర్ కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో జితేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సీఐ జితేందర్ మాట్లాడుతూ 1టౌన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. నూతన సీఐ జితేందర్‌కు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ లోన్ ఆపర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి...

ములుగు ఎస్పీ. సుధీర్ రామ్నాథ్ కేక న్..




ములుగు. అక్టోబర్ 07(సూర్యోదయ వార్త. ములుగు ప్రతినిధి)

– తక్షణ రుణాలు. తక్కువ వడ్డీ రుణాలు. నిమిషాల్లో లోన్ మంజూరు చేస్తామంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలను ఆకర్షించి మోసాలు చేస్తున్నారని. ఇలాంటి నకిలీ లోన్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ. సుధీర్ కేక న్ అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన ఫుల్ ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్. కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాల విచారణ కోసం రూపొందించిన పోస్టర్ ను ఆవిష్కరించారు...



నా డ్రెస్‌పై ప్రైమ్‌టైమ్ డిబేటా నమ్మలేకపోయా!

ముంబై, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం): "నా దుస్తుల గురించి ఏకంగా ఆరుగురు వ్యక్తులు కూర్చొని చర్చించడం చూసి షాకయ్యా. అసలు అది జరుగుతోందంటేనే నమ్మలేకపోయా" అంటూ బాలీవుడ్ నటి కృతి సనన్ గతంలో తన రక్షాబంధన్ ప్రకటన చుట్టూ తలెత్తిన వివాదాన్ని గుర్తుచేసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో మొదలైన విమర్శలు చివరకు టీవీ చానళ్లలో ప్రైమ్‌టైమ్ చర్చల వరకు వెళ్లడం తనను తీవ్రంగా ఆశ్చర్యపరిచిందని చెప్పారు.కరీనా కపూర్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'వాట్ విమెన్ వాంట్' ఆరో సీజన్‌లో పాల్గొన్న కృతి.. తనపై గతంలో వచ్చిన విమర్శల గురించి మాట్లాడారు. రక్షాబంధన్‌కు సంబంధించిన ఓ ప్రకటనలో తాను ధరించిన దుస్తులపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున విమర్శలు వచ్చాయని, వివాదం ముదరడంతో చివరకు సంబంధిత సంస్థ ఆ ప్రకటనను తొలగించిందని గుర్తుచేశారు. "నా డ్రెస్ అంత పెద్ద వివాదానికి కారణమవుతుందని అస్సలు అనుకోలేదు. సామాజిక మాధ్యమాల్లో విమర్శలు రావడం ఒక ఎత్తయితే.. టీవీలో ఆరుగురు సభ్యులతో ప్యానెల్ ఏర్పాటు చేసి నా దుస్తులపై చర్చించడం మరో ఎత్తు. అది చూసి నిజంగానే షాకయ్యా" అని కృతి వ్యాఖ్యానించారు. మహిళలు ఏం ధరించాలి? ఎలా కనిపించాలి? ఎలా ప్రవర్తించాలి? అనే విషయాల్లో ఇతరులు నిరంతరం తీర్పులు ఇవ్వడం మానుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మహిళలు ప్రధానంగా కోరుకునేది ఏమిటన్న ప్రశ్నకు స్పందిస్తూ.. "ఇతరులను అనవసరంగా జడ్జ్ చేయడం ఆపేయండి. ఎవరి పని వారు చూసుకుంటే చాలు" అని పేర్కొన్నారు. మహిళల వస్త్రధారణకు హద్దులు నిర్ణయించడం, వారి వ్యక్తిగత ఎంపికలపై ఇతరులు తీర్పులు ఇవ్వడం వంటి ధోరణులు మారాల్సిన అవసరం ఉందన్న కృతి వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



నన్ను సరిగ్గా అంచనా వేయక..

తక్కువ సినిమాలు చేయడానికి కారణం [illegible] శెట్టి

హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం): 'కేజీఎఫ్'తో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నా.. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో సినిమాలు చేయలేకపోవడానికి కారణమేంటో నటి శ్రీనిధి శెట్టి వెల్లడించారు. తాను కావాలనే సినిమాల సంఖ్య తగ్గించుకోవడం లేదని, మంచి అవకాశాలు వస్తే ఏడాదికి నాలుగైదు చిత్రాల్లో నటించేందుకు కూడా సిద్ధమేనని స్పష్టం చేశారు. తన టైమింగ్ కలిసి రాకపోవడం లేదా మేకర్స్ తన సామర్థ్యాన్ని సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల అనుకున్నన్ని అవకాశాలు రాలేదేమోనని అభిప్రాయపడ్డారు. వెంకటేష్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'లో ప్రస్తుతం శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాల ఎంపిక గురించి ఆమె ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "గత కొన్నేళ్లుగా నేను చాలా తక్కువ సినిమాలు చేస్తున్నానని అందరూ నన్ను సెలక్టివ్ అనుకుంటున్నారు. నిజానికి కెమెరా ముందు నటించడమంటే నాకు చాలా ఇష్టం. మంచి అవకాశాలు వస్తే ఏడాదికి నాలుగు, ఐదు సినిమాలు చేయడానికి కూడా సిద్ధమే. అయితే మంచి కథతోపాటు ఆసక్తికరమైన టీమ్ కుదరాలి" అని శ్రీనిధి చెప్పారు. కొన్నిసార్లు తనకు సరైన సమయంలో సరైన అవకాశాలు రాలేదేమోనని అనిపిస్తుందని తెలిపారు. "నా టైమింగ్ బాగోలేకపోవడం కావచ్చు.. లేదా మేకర్స్ నన్ను సరిగ్గా అంచనా వేయలేకపోవడం కావచ్చు. అందుకే అనుకున్నన్ని అవకాశాలు రాలేదేమో. ఒక్కోసారి నేను మంచి నటిని కాదేమో.. అందుకే అవకాశాలు ఇవ్వడం లేదేమో అనే ఆలోచన కూడా వస్తుంది" అని పేర్కొన్నారు. తన గురించి తాను ఎప్పుడూ అతిగా ఊహించుకోనని, వాస్తవానికి దగ్గరగా ఉండేందుకే ప్రయత్నిస్తానన్నారు. కొత్త దర్శకుడైనా, అగ్ర దర్శకుడైనా తనకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతతో ఉంటానని చెప్పారు. సినిమాపై ఉన్న అభిరుచితోనే తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వెంకటేష్-త్రివిక్రమ్ కలయికలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' గురించి శ్రీనిధి ప్రత్యేకంగా స్పందించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రంలో తనకు అవకాశం వస్తుందని కలలో కూడా ఊహించలేదని, ఈ ప్రాజెక్టులో భాగం కావడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.





మాధురి రాథోడ్ మళ్లీ జోరు..

కొత్త ఫోక్ సాంగ్‌తో కమ్‌బ్యాక్



హైదరాబాద్, అక్టోబరు 7 (ఉద్యమ కెరటం): 'నిమ్మ తోట వనములో', 'సీటీ చీర', 'బాసింగ బలాలే' వంటి జానపద పాటలతో తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకున్న మాధురి రాథోడ్ మరోసారి వార్తల్లో నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన ఆమె మోడల్‌గా, డిజిటల్ కంటెంట్ సృష్టికర్తగా, ముఖ్యంగా జానపద నృత్యకారిణిగా మంచి పేరు సంపాదించుకుంది. తాజాగా 'బిందెలు బిందెలు బావయ్యో' అనే కొత్త జానపద పాటతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'బిందెలు బిందెలు బావయ్యో' పాటకు సంబంధించిన ప్రచార దృశ్యాలను తాజాగా విడుదల చేశారు. ఎప్పటిలాగే మాధురి రాథోడ్ తనదైన మాస్ ఎనర్జీతో స్టెప్పులు వేసి ఆకట్టుకుంది. పాట విడుదలైన కొద్ది గంటల్లోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. యూట్యూబ్‌తో పాటు ఇతర వేదికల్లోనూ ఈ పాటకు మంచి స్పందన లభిస్తోంది. త్వరలోనే పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఇటీవల మాధురి రాథోడ్, ఆమెతో కలిసి పనిచేసిన నృత్యకారుడు ఈశ్వర్ సాయి వ్యక్తిగత వ్యవహారం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ ఘటనల నేపథ్యంలో ఇద్దరి కెరీర్ దెబ్బతింటుందని పలువురు భావించారు. అయితే ఈశ్వర్ సాయి కూడా ఇటీవల తన కొత్త పాటకు సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించి, వృత్తిపరంగా మళ్లీ బిజీ అవుతాననే ధీమా వ్యక్తం చేశాడు. తాజాగా మాధురి కూడా కొత్త పాటతో ప్రేక్షకుల ముందుకు రావడంతో ఇద్దరూ తమ కళారంగ కార్యకలాపాలను కొనసాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ జోడీకి జానపద పాటల్లో మంచి క్రేజ్ ఉంది. వీరిద్దరూ కలిసి నటించిన 'రాతిరి రాతిరి రాతిరిలో', 'సీటీ చీర', 'సన్న సన్న బియ్యమే', 'ప్రమీల ప్రమీల', 'కళ్లకు కాటుక దిద్దినారో', 'అది అబ్బబ్బాగా పోరి', 'లాయి లాయి లబ్బరు బొమ్మ', 'బాసింగా బలాలే' వంటి పాటలు యూట్యూబ్‌లో భారీగా వీక్షణలు సాధించాయి. దీంతో కొత్తగా వచ్చిన 'బిందెలు బిందెలు బావయ్యో' పాటపైనా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

'నా వైఫ్ మిస్సింగ్'.. అసలు ఆమెకు ఏమైంది?

[illegible]త్కంఠ రేపుతున్న టీజర్

హైదరాబాద్, అక్టోబర్ 7 (ఉద్యమ కెరటం): భార్య కనిపించడం లేదంటూ ఓ భర్త పోలీస్ స్టేషన్‌కు వెళ్తాడు.. కానీ ఆమె నిజంగానే అదృశ్యమైందా? ఇంటి నుంచి వెళ్లిపోయిందా? ఆమెకు ఏదైనా జరిగిందా? లేక ఈ కథ వెనుక భర్తకే తెలియని రహస్యం ఉందా?.. ఇలా వరుస ప్రశ్నలు రేకెత్తిస్తూ 'నా వైఫ్ మిస్సింగ్' టీజర్ ఆసక్తి పెంచుతోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ అక్టోబర్ 22 నుంచి 'ఆహా'లో ప్రసారం కానుంది. 'కొత్త బంగారు లోకం'తో యువత మనసులు గెలుచుకున్న వరుణ్ సందేశ్-శ్వేతా బసు ప్రసాద్ జోడీ దాదాపు 18 ఏళ్ల తర్వాత మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే ఈసారి ప్రేమ కథతో కాకుండా సస్పెన్స్, మిస్టరీతో నిండిన వెబ్ సిరీస్‌తో అలరించేందుకు సిద్ధమైంది. 'నా వైఫ్ మిస్సింగ్'లో వరుణ్ సందేశ్ సాధారణ బ్యాంకు ఉద్యోగి 'బాలు' పాత్రలో కనిపించనుండగా, ఆయన భార్య పాత్రను శ్వేతా బసు ప్రసాద్ పోషిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో పెళ్లి తర్వాత తన భార్య కనిపించడం లేదంటూ బాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం కథకు కీలక మలుపుగా కనిపిస్తోంది. అక్కడి నుంచే అసలు ఉత్కంఠ మొదలవుతుంది. ఆమెకు ఏమైంది? స్వచ్ఛందంగా వెళ్లిపోయిందా? ఏదైనా ప్రమాదం జరిగిందా? ఈ వ్యవహారంలో భర్త పాత్ర ఏంటి?.. అనే అనుమానాలను టీజర్ రేకెత్తిస్తోంది. ఊహించని మలుపులతో కథను నడిపించనున్నట్లు టీజర్ సంకేతాలిస్తోంది. 'అనుమానం.. అవమానం.. అవకాశం..' అనే ఆసక్తికరమైన ప్రచార వాక్యంతో వస్తున్న ఈ సిరీస్‌ను తెలుగు, తమిళ భాషల్లో అక్టోబర్ 22 నుంచి ప్రసారం చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

